# ప్లాస్టిక్ వాడకం తగ్గించండి

గుమ్మడిపూండి, న్యూస్‌లైన్ : పర్యావరణాన్ని రక్షించుకునేందుకు ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించాలని కోరుతూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సోమవారం కొత్త గుమ్మడిపూండికి చెందిన గాంధీ వరల్డ్ ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలపై ప్రజలతో అవగాహన కలిగించేందుకు ర్యాలీ జరిపారు. ముందు భాగంలో గాంధీజీ వేషంలో ఓ విద్యార్థి ఉండగా, చిన్నారులు తెల్లటి అంగీలు, శాంతి టోపీలు ధరించి ప్లకార్డులు చేతపట్టి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీని గాంధీ వరల్డ్ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకుడు ఎం ఎల్ రాజేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1930వ సంవత్సరంలో గాంధీ భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించారన్నారు. ఉప్పు సత్యాగ్రహానికి 78 సంవత్సరాలు పూర్తయ్యాయన్నారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకం వలన వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు తమ సంస్థ 78 మంది చిన్నారుల చేత ఈ యాత్ర చేపట్టిందన్నారు. గాంధీ సిద్ధాంతాలు ప్రతి యువతకు ఎంతో అవసరం అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం బైపాస్‌రోడ్డు మీదుగా బస్టాండ్, రెట్టంబేడు రోడ్డు వరకు కరపత్రాలు పంచుతూ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీలో ట్రస్టీ మేనేజర్ ఆర్.విజయలక్ష్మి, సభ్యులు దిలీప్‌కుమార్, శ్యాంసుందర్, ప్రమీద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




గాంధీ వరల్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీ